పిల్లుల యాత్ర

చక్కని కథలు - 1



రచన: వాండాగేగ్
అనుసృజన: కె. ఆదర్శ సామ్రాట్

జన విజ్ఞాన వేదిక ప్రచురణ

పిల్లల యాత్ర

రచన	:	వాండాగేగ్
అనుసృజన	:	కె.ఆదర్శ సామ్రాట్
చిత్రాలు	:	వాండాగేగ్
ప్రచురణ	:	జన విజ్ఞాన వేదిక
కంప్యూటర్ లే అవుట్	:	రత్నశ్రీ టెక్నో ప్రింట్స్, హైదరాబాద్.
సహకారం	:	బి.భాగ్య, ఎస్.కె.అమీన్
తొలి ముద్రణ	:	మే, 2004
కాపీలు	:	2000
వెల	:	రూ. 8.00

ముద్రణ : చరిత గ్రాఫిక్స్, అల్వాల్, సికింద్రాబాద్ - 500 015. ఫోన్ : 55295078

ప్రతులకు

జి. మాల్యాద్రి

కన్వీనర్, ప్రచురణల విభాగం

'జన విజ్ఞాన వేదిక'

162, విజయలక్ష్మి నగర్,

నెల్లూరు - 524 004.

ఫోన్: 94402 79604

For Copies

G. MALYADRI

Convenor, Publications

Jana Vignana Vedika

162, Vijayalaxmi Nagar,

Nellore - 524 004.

Phone: (0861) 2305303

పిల్లుల యాత్ర



రచన : వాండాగేగ్

అనుసృజన

కె. ఆదర్శ సామ్రాట్



చాలా కాలం కిందటి మాట.

ఒక పండు ముసలి ఉండేవాడు. అతనికి తోడుగా మరో పండు ముసలమ్మ. ఇద్దరూ కలిసి ఇంపుగా, సొంపుగా ఉండే ఒక చిన్న ఇంట్లో ఉండేవారు.

ఆ ఇల్లు చాలా బాగుంటుంది. ఇంటి చుట్టూ పూల తోట. తలుపు నుంచి గేటు దాకా ఓ చిన్ని బాట. అయినా ఆ ముసలివాళ్ళకు సంతోషం లేదు. ఒంటరిగా ఉన్నామని బాధపడేవారు.



“మనకే కనుక ఒక పిల్లి ఉండి ఉంటే” ఒకనాడు ముసలమ్మ పొయ్యి రాజేస్తూ అంది.

“పిల్లా!” అన్నాడు ముసలయ్య.

“ఆ. అవును. పిల్లే. ముద్దుగా, బొద్దుగా, మియావ్ మియావ్ అంటూ ఇంట్లో పిల్లి తిరుగుతుంటే ఎంత బాగుంటుంది” అంది ముసలమ్మ ఆశగా.

“నీకంత ఇష్టమైతే నేనెందుకు కాదంటాను. రేపే నీ కోసం ఓ మంచి పిల్లిని తీసుకొస్తాను” అన్నాడు ముసలయ్య.



పిల్లి కోసం వెతుకుతూ ముసలయ్య బయలుదేరాడు. ఎండలో మండిపోతున్న కొండలెక్కాడు. చలితో వణుకు పుట్టించే లోయలు దాటాడు. అలా చాలా దూరం నడిచాడు.

నడిచి నడిచి చివరకు ఓ పెద్ద కొండ దగ్గరకు చేరుకున్నాడు. అది అలాంటిలాంటి కొండ కాదు. పిల్లుల కొండ. అక్కడ ఎటు చూసినా పిల్లులే!

ఇటూ పిల్లులే అటూ పిల్లులే
పైన పిల్లులే కింద పిల్లులే
తూరుపు పడమర ఉత్తర దక్షిణ
అన్ని దిక్కులా ఒకటే పిల్లులు!

మ్యావ్ మ్యావ్ అంటూ మియ్యావ్ అంటూ
ఆడుతూ గెంతుతూ అరుస్తూ దూకుతూ
లక్షలు కోట్లు పిల్లులు పిల్లులు
అడుగు అడుగునా ఒకటే పిల్లులు!

"ఓహో అద్భుతం" ముసలయ్య సంతోషం పట్టలేకపోయాడు. ఇప్పుడు నేను అన్నిటికన్నా అందంగా ఉన్న పిల్లిని ఇంటికి తీసుకుపోతాను అనుకున్నాడు.

వెతికి వెతికి ఓ తెల్లపిల్లిని పట్టుకున్నాడు.

దాన్ని తీసుకొని కొంచెం దూరమైనా నడిచాడో లేదో అతనికి మరో చక్కటి పిల్లి కన్పించింది. అది తెలుపు-నలుపు రంగుల్లో ఉంది. అయితే మొదటి పిల్లి లాగే అదీ అందగానే ఉంది. చాలా ముద్దుగా ఉంది. ఇంకేం.

ముసలయ్య దాన్ని కూడా ఒడిలోకి తీసుకున్నాడు.

ఇంతలో ఒళ్ళంతా పట్టులాంటి బొచ్చుతో ఉన్న మరో అందమైన పిల్లి కంట పడింది.



దాని రూపు రేఖలు మొదటి పిల్లులకు ఏ మాత్రం తీసిపోవు. చూడముచ్చటగా ఉంది. దాంతో ముసలయ్య ఆ పిల్లినీ ఎత్తుకున్నాడు.

అంతలోనే అతడికి మరో పిల్లి కన్పించింది. దీన్ని చూస్తే చాలా ముద్దొస్తుంది. అంత చక్కటి పిల్లిని వదిలి పోవడం ఏం బాగుంటుందిఅనుకున్నాడు.

అందుకని ముసలయ్య దాన్నీ తీసుకున్నాడు.

ఒక్క అడుగైనా వేసాడో లేదో ముసలయ్యకు మరో పసందైన పిల్లి కన్పించింది. కాటుక నలుపులో మహా అందంగా ఉంది ఆ పిల్లి పిల్ల. మిగతా వాటిని తలదన్నేలా ఉంది.

“ఇంత చక్కని పిల్లిని వదిలేసి పోవడం ఘోరమైన విషయం” అనుకున్నాడు ముసలయ్య. వెంటనే దానినీ చంకనెత్తుకున్నాడు.

అంతలోనే అతనికి మరో పిల్లి కన్పించింది. చిరుతపులికి మల్లే దాని ఒంటి నిండా గుండ్రని, పల్చని మచ్చలున్నాయి. చూస్తే మరువబుద్ధి కాదు.

"ఇలాంటి పిల్లిని తీసుకెళ్ళాల్సిందే" అనుకున్నాడు ముసలయ్య. ఇక చెప్పేదేముంది. మరో ఆలోచన లేకుండా దానినీ నెత్తినెక్కించుకున్నాడు.

ముసలయ్య తలెత్తి చూస్తే చాలు. ఒక అందమైన పిల్లి కన్పిస్తుంది. వదిలిపోడానికి మనస్రాదు. దాన్ని చంకనెత్తుకోగానే మరొకటి కన్పిస్తుంది. అదయ్యాక ఇంకొకటి, అది కూడా అయ్యాక మరొకటి.... చివరకు ఒక్క పిల్లినీ అతను వదిలిపెట్టలేదు. అక్కడున్న పిల్లులన్నిటినీ వెంటబెట్టుకుని ఇంటికి బయలుదేరాడు.

13

ముసలయ్య ముందు నడుస్తున్నాడు. అన్ని పిల్లులు అతని వెంట నడుస్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు. వంద కాదు వెయ్యి కాదు. వేలు, లక్షలు, కోట్ల పిల్లులు. అవన్నీ బారులు తీరాయి. అదొక పెద్ద ఊరేగింపులా ఉంది. పిల్లుల ఊరేగింపు ! భలే చిత్రంగా ఉంది.

"ఈ సొగసైన పిల్లులన్నిటినీ మా ముసలమ్మకు చూపించాలి" ముసలయ్య తొందరపడుతున్నాడు. గబగబా అడుగులేస్తున్నాడు. వేడితో సెగలు కక్కుతున్న కొండల్ని ఎక్కుతున్నాడు. మంచుతో నిండిపోయి ఉన్న లోయలను దాటుతున్నాడు.

14



15



అలా నడుస్తూ నడుస్తూ అతను ఓ పెద్ద చెరువు దగ్గరకు వచ్చాడు.

“మియ్యావ్! మియ్యావ్! మాకు దాహం వేస్తోంది”

వేలు, లక్షలు, కోట్ల పిల్లులు ఒకేసారి అన్నాయి.

"మరేం ఫరవాలేదు. ఇక్కడ బోలెడన్ని నీళ్లున్నాయి" అన్నాడు ముసలయ్య.

ప్రతి పిల్లి ఒక గుక్కెడు నీరు తాగింది. ఒకే ఒక గుక్క. అయినా చెరువంతా ఖాళీ అయింది.

చుక్క నీరు మిగిలితే ఒట్టు. మొత్తం ఖాళీ!





"మియ్యావ్! మియ్యావ్! ఇప్పుడు మాకు ఆకలేస్తోంది"

ఆ వేలు, లక్షలు, కోట్ల పిల్లులు ఒకేసారి అరిచాయి.

"ఈ కొండ మీద బోలెడంత గడ్డి వుంది" అన్నాడు ముసలయ్య.

ప్రతి పిల్లి ఒక గడ్డిపరకను తింది. ఒకే ఒక గడ్డిపరక. అయినా కొండ మీది గడ్డంతా మాయమయ్యింది. చిన్న గడిపరకైనా మిగల్లేదు. కొండ మొత్తం గుండు గీసినట్లు తయారయింది.



మరికొద్ది సేపటికి ముసలయ్య ఇల్లు చేరాడు. ముసలమ్మ కెవ్వున కేకపెట్టింది.

"ఓరి దేవుడా! ఇదేం పని. నాకొక చిన్న పిల్లిపిల్ల కావాలన్నాను. అంతే. కాని నువ్వు చూస్తే లోకంలోని పిల్లులన్నిటినీ తీసుకొచ్చావు" అని ముసలమ్మ గయ్యిమంది.

ఇక్కడ పిల్లి అక్కడ పిల్లి

ముందర పిల్లి వెనుకన పిల్లి

ఇక్కడ అక్కడ ఎక్కడ చూసినా

ఒకటే పిల్లులు! లక్షలు, కోట్లు!

"మనం ఇన్ని పిల్లుల్ని ఎలా పెంచగలం? వీటిని చూస్తే మన ఇంటినే తినేసేటట్టున్నాయి." అంది ముసలమ్మ.

"అరే! నాకా సంగతి తట్టనే లేదు" అన్నాడు ముసలయ్య తల గోక్కుని.

"మరిప్పుడేం చేద్దాం?"

ముసలమ్మ కొంచెం సేపు ఆలోచించింది.

"ఆ, తట్టింది. మనతో ఏ పిల్లి ఉంటానంటుందో తెలుసుకుందాం. ఆ సంగతి వాటినే అడుగుదాం." అంది.

"సరే" అంటూ ముసలయ్య పిల్లుల్ని దగ్గరకు పిలిచాడు. "మీలో అందరికన్నా అందంగా ఉన్న పిల్లేది?" అడిగాడు.

"నేను" అంది ఒక పిల్లి.

"కాదు నేను" అంది మరో పిల్లి.

"అవి రెండూ కానే కాదు. నేనే అందమైన పిల్లిని" అంది మూడో పిల్లి.

"కాదు కాదు. నేనే.... నేనే అందమైన పిల్లిని" పిల్లులన్నీ ఒక్కపెట్టున అరిచాయి. మిగతా వాటి కన్నా తనే అందంగా ఉంటానని ప్రతి పిల్లి అనుకుంది.

నేను నేనంటూ పిల్లులు కొట్లాట మొదలెట్టాయి.

పిల్లులు ఒక దాన్నొకటి కరుచుకుంటున్నాయి. బరుక్కుంటున్నాయి. కింద పడేసుకుంటున్నాయి. చెవులు చిల్లులు పడేలా అరుస్తున్నాయి. పాపం ముసలమ్మ, ముసలయ్య భయంతో వణికిపోయారు. రయ్యిన ఇంట్లోకి పరిగెత్తి తలుపులు మూసుకున్నారు. పిల్లులు అలా కొట్లాడుకోవడం వారికి అస్సలు నచ్చ లేదు. అయితే కొద్దిసేపటికి అంతా సద్దుమణిగింది. బయటి నుంచి ఎలాంటి అలికిడి విన్పించలేదు. ఏం జరిగిందా అని ముసలమ్మ, ముసలయ్య కిటికీలోంచి తొంగి చూసారు. ఆశ్చర్యం! అక్కడ ఒక్క పిల్లీ కన్పించలేదు!



"ఆ మాయదారి పిల్లులు ఒకదాన్నొకటి తినేసాయేమో" అంది ముసలమ్మ. "ఇదేం బాగోలేదు" అన్నాడు ముసలయ్య. జరిగిందానికి అతను బాగా నొచ్చుకున్నాడు. అన్ని దిక్కులూ పరికించి చూశాడు. "ఒకసారటు చూడు" అన్నాడు సంబరంగా. అక్కడో పెద్ద మట్టిదిబ్బ. దాని మీద ఒక చిన్న పిల్లిపిల్ల కూర్చొని ఉంది! అది బాగా బెదిరిపోయింది. గజగజా వణుకుతోంది. ముసలయ్య అటుగా నడిచాడు. పిల్లిపిల్లను చేతుల్లోకి తీసుకున్నాడు. బక్కగా, నీరసంగా, జబ్బుపడిన దానిలా ఉందది.

"పాపం, ఎంత చిక్కిపోయిందో" అంది ముసలమ్మ.

"ఎంత ముద్దుగా ఉందో" అన్నాడు ముసలయ్య.

"ఆ వేలు, లక్షలు, కోట్ల పిల్లులు నిన్ను తినకుండా ఎలా వదిలాయమ్మా" అన్నాడు పిల్లితో గోముగా.

"నేనొక చిన్న పెంపుడు పిల్లిని" అంది పిల్లిపిల్ల. "మాలో అందమైన పిల్లేదని మీరు అడిగారుగా. అప్పుడు నేను ఏమీ అనకుండా నోరు మూసుకుని కూచున్నాను. అందుకే ఏ పిల్లి చూపూ నా మీద పడలేదు" అంది.



ఇద్దరూ కలిసి పిల్లిపిల్లను ఇంట్లోకి తీసుకొచ్చారు. వేడి వేడి నీళ్ళతో ముసలమ్మ దానికి స్నానం చేయించింది. నున్నగా, మెరుస్తూ ఉన్న బొచ్చును దువ్వెనతో సవరించింది.

27



పిల్లికి ప్రతిరోజూ దండిగా పాలు పోస్తున్నారు.
ఆడుతూ, గెంతుతూ తాగుతూంది.

కొన్ని రోజుల్లోనే అది పుష్టిగా తయారయింది.

బలం పుంజుకొంది. చురుగ్గా మారింది.





"ఎలాగైతేనేం. చివరకు మనకో చక్కటి పిల్లి దొరికింది" అంది ముసలమ్మ.

"ఇది లోకంలోని పిల్లులన్నిటిలోకి అందమైనది" అన్నాడు ముసలయ్య. "ఆ వేలు, లక్షలు, కోట్ల పిల్లుల్లో ఏ పిల్లీ ఇంత అందంగా లేదు" అన్నాడు గర్వంగా.

31



32

మా మాట

నేడు గ్రామాల్లో డజన్ల కొద్దీ టీవీ ఛానెల్స్ వస్తున్నాయి. రకరకాల సిగరెట్లు, కూల్‌డ్రింకులు దొరుకుతున్నాయి. మారుమూల గ్రామాల్లో కూడా అడ్డమైన చెత్తా దొరుకుతోంది. కాని.... చదువుకుందామంటే ఒక మంచి పుస్తకం మాత్రం దొరకడం లేదు.

బడిపిల్లలకు, కొత్తగా చదువు నేర్చుకొనే వారికి కొన్ని ప్రత్యేక అవసరాలున్నాయి. అన్నిటి కన్నా ముందుగా వారికి చదువంటే ఇష్టం కలగాలి. పుస్తకాలు చదివే అలవాటుని బాగా పెంచుకోవాలి. కొత్త కొత్త పుస్తకాలను చదవాలి. నేర్చుకున్న చదువుని మరింత సార్థకం చేసుకోవాలి. అలా చేస్తేగాని వారికి నిజంగా 'చదువు' వచ్చినట్లు కాదు.

ఈ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని 'జనవిజ్ఞాన వేదిక' గతంలో అనేక పుస్తకాలను ప్రచురించింది. వీటిలో సుమారు ఒక 30 కథల పుస్తకాలూ ఉన్నాయి. వీటిని అందరూ ఆదరించారు. ముఖ్యంగా గ్రామాల్లోని పిల్లలు, పెద్దలు ఎంతో ఇష్టంగా చదివారు. ఈ ప్రోత్సాహంతో తాజాగా మరికొన్ని కథల పుస్తకాలు ప్రచురిస్తున్నాం. 'చక్కని కథలు' శీర్షికతో ఏడాదిలోగా ఇలాంటి ఒక 40 పుస్తకాలైనా ప్రచురించాలన్నది మా ఆశయం.

ఇలాంటి పుస్తకాలు చదువంటే ఇష్టాన్ని, చదివే అలవాటుని బాగా పెంచుతాయి. మన చుట్టూ ఉన్న మనుషులను, లోకాన్ని మరింత చక్కగా అర్థం చేసుకొనేందుకు వీలు కల్పిస్తాయి. మనం మరింత అందంగాను, ఆరోగ్యంగాను ఆలోచించేందుకు తోడ్పడతాయి. అక్షరాలు నేర్చిన ప్రతి ఒక్కరూ చదివి ఆనందించగలిగేలా వీటిని రూపొందించాం.

ఈ పుస్తకాల గురించి ఏమనుకుంటున్నారో మాకు తప్పక తెలియజేయండి. మీ సూచనలు, సలహాలు మరిన్ని మరింత మంచి పుస్తకాలు అందించేందుకు తోడ్పడతాయని మరువకండి.

జి. మాల్యాద్రి
కన్వీనర్, ప్రచురణ విభాగం